IMMANUEL BIBLE COLLEGE
CHRISTIANPET NIDUBROLU

# గొప్ప జ్ఞానము

## (సామెతల గ్రంథం సంగ్రహ సమీక్ష)

## A. ఉపోద్ఘాతం :

1. **గ్రంథ రచయితలు :** ఈ గ్రంథంలోని సామెతలు దరిదాపు అన్నీ సొలొమోను వ్రాసాడు. I రాజులు 4:32 ప్రకారం సొలొమోను 3000 సామెతలు వ్రాసాడని తెలుస్తున్నది. వాటిలో నుండి తీసుకొనబడిన సామెతలే ఈ గ్రంథంలో పొందుపర్చబడినవి. 1-24 అధ్యాయాలలోని సామెతలను సొలొమోను స్వయంగా వ్రాసాడు. 25-29 అధ్యాయాలలోని సామెతలు సొలొమోను చెప్పినవే అయినా, యూదా రాజైన హిజ్కియా సేవకులు వాటిని సేకరించి వ్రాసారు. 30వ అధ్యాయమును ఆగూరు అనే దీర్ఘదర్శి మరియు 31వ అధ్యాయాన్ని రాజైన లెమూయేలు వ్రాసాడు. ఏది ఏమైనా ఈ 31 అధ్యాయాల కూర్పు సొలొమోనుదే.
2. **రచనకాలం :** సొలొమోను పరిపాలన కాలంలో అనగా (క్రీ.పూ. 971-931 సం॥ల మధ్యకాలంలో).
3. **సామెతల గ్రంథ ఉద్దేశం :** మానవుడు జ్ఞానం ఎలా పొందగలడో, తెలివి, వివేకము, క్రమ శిక్షణతో కూడిన జీవితం ఎలా జీవించాలో, నీతిన్యాయం. యథార్థమైనది చేయుట ఎలాగో నేర్పించుట (సామెతలు 1:2,3). అనుదిన జీవితానికి దైవిక జ్ఞానం అవలంబింప చేయుట. నైతిక సూత్రాలు, సలహాలు అందించుట.
4. **ముఖ్యాంశం :** జ్ఞానం.
5. **మూల వాక్యం :** "యెహోవాయందు భయభక్తులు కలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము. పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము" (సామె 9:10).
6. **గ్రంథ విశిష్టత :** సామెతల గ్రంథాన్ని ఏ కోణంలో పరిశీలించి, పఠించినా మనకు గోచరమయ్యేది జ్ఞానము. అందుకే ఇది జ్ఞాన సాహిత్యం (Wisdom Literature) లో చేర్చబడింది. యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి, పరమగీతములు పాతనిబంధనలో పద్యభాగంలో చేర్చబడినప్పటికీ, సామెతల గ్రంథం జ్ఞానం సంతరించుకొని ఈ గ్రంథాలన్నిటికి తలమానికం అయింది.

సామెతల గ్రంథంలో ఆచరణాత్మకమైన దైవిక జీవితాన్ని కనుగొనగలము. ఇందులో జీవితంలోని ప్రతివిధమైన సంబంధాల్ని గూర్చి చెప్పబడింది. దేవుని పట్ల, పొరుగువారి పట్ల, తల్లిదండ్రులు మరియు పిల్లల పట్ల మన బాధ్యతలను, దేశపౌరులుగా మనం తప్పకుండా పాటించాల్సిన వాటిని గూర్చి ఈ గ్రంథం తెలియజేస్తుంది.

యూదులు, సామెతల గ్రంథాన్ని దేవుని మందిరపు వెలుపలి ఆవరణంగా, ప్రసంగి గ్రంథాన్ని పరిశుద్ధ స్థలంగా, పరమ గీతాల గ్రంథాన్ని అతిపరిశుద్ధ స్థలంగా పరిగణిస్తారు. మనకు తెలిసినట్లుగా వెలుపలి ఆవరణంలో దహన బలులర్పించే బలిపీఠం, దాని బూడిదను ఎత్తే జల్లెడ ఉంటుంది. సమర్పణగల మనస్సుతో, శుద్ధ హృదయంతో ఈ గ్రంథాన్ని చదివితే

అనేక విషయాలను మనం నేర్చుకోవచ్చును. అది మనల్ని వెలుపలి ఆవరణంలోనికి ప్రజల మధ్యకు తీసుకొని వెళ్తుంది. అక్కడ వారి దైనందిన జీవితం, జీవిత మార్గంలో ఇతరులతో గల సంబంధాలు మనకు కనిపిస్తాయి. మన దైనందిన జీవితానికి, నీతియుక్తమైన జీవితానికి సూచనలనిచ్చే గ్రంథమిది.

- కీర్తనల గ్రంథంలో క్రైస్తవుడు మోకాళ్ళపై కనిపిస్తాడు
  సామెతల గ్రంథంలో తన కాళ్ళపై నిలబడ్డం చూస్తాము.
- కీర్తనల గ్రంథం క్రైస్తవుని ఆరాధన కోసం ఉద్దేశించబడింది.
  సామెతల గ్రంథం క్రైస్తవుని నడతను గూర్చి ఉద్దేశించబడింది.
- కీర్తనల గ్రంథం ప్రార్థన గదికి సంబంధించినది.
  సామెతల గ్రంథం వాణిజ్య మరియు క్రీడా స్థలాలకు, కుటుంబానికి సంబంధించినది.

సామెతల గ్రంథం మనుష్యులను జ్ఞానులు మరియు బుద్ధిహీనులు అని రెండు వర్గాలుగా విభజిస్తుంది. జ్ఞానము అనే మాటలోనే ఈ గ్రంథ నిజసౌందర్యం, శక్తి గుప్తమైయున్నది. ఈ జ్ఞానమే క్రొత్త నిబంధనలో శరీరధారిగా అవతరించిన వాక్యమని స్పష్టమౌతున్నది. ఈ గ్రంథంలో క్రీస్తు ప్రత్యక్షపరచబడ్డాడు. జ్ఞానముగా ఆయన నిత్యత్వంలో దేవునితో నివసించాడు. సామె 8:23-31 ని యోహా 1:1, 2; హెబ్రీ 1:2; కొల 2:3తో పోల్చి చదవండి. సామెతల గ్రంథంలో జ్ఞానము అనే మాట ఉపయోగించబడిన ప్రతిచోట క్రీస్తు అనే మాట నుంచి చదవండి. (I కొరి 1:30).

7. **సామెతల గ్రంథ చిత్రీకరణ :** ఈ గ్రంథము, జీవిత పాఠశాలలో చేరబోతున్న ఒక యౌవనస్తుని చిత్రాన్ని సూచిస్తుంది. ఇది అతని మొదటి పాఠం 1:7. అతని ఎదుట రెండు పాఠశాలలున్నాయి. అవి 1) జ్ఞానుల పాఠశాల 2) బుద్ధిహీనుల పాఠశాల. ఈ రెండు కూడా వాటి వాటి పాఠాలను బోధిస్తున్నాయి. వాటిలో దేనిని ఎన్నుకోవాలో ఆ యౌవనస్తుడే నిర్ణయం చేసుకోవాలి. ఈ గ్రంథం చదువుతూ ఉండగా మిమ్మల్ని మీరు ఆ యౌవనస్తుని స్థానంలో వుంచుకొని చిత్రీకరించుకొని, జీవిత పాఠాలను నేర్చుకోవాలని మా ఆకాంక్ష.

## B. సామెతల గ్రంథ విభజన :

సామెత అంటే దీర్ఘకాల అనుభములో నుండి తీసుకొనబడిన చిన్న వాక్యము. ఇవన్నీ జీవిత అనుభవంలో నేర్చుకొన్న పాఠాలు. ఈ గ్రంథంలోని ప్రతి వచనం ఒక ఆత్మీయ పాఠమే. ఒక విధంగా చెప్పాలంటే ఈ గ్రంథం ఒక కలగూర గంపలాంటిది. దాని నుండి మనకు అవసరమైన అంశాలకు సంబంధించిన విషయాలను సంగ్రహించాలి. అనగా అంశాల వారిగా విభజించి చదివితే సులభంగా అర్థమౌతుంది.

ఈ గ్రంథంలోని సూచనలను బట్టి మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చును.

---

<u>గమనిక</u> :- ఈ "గొప్ప జ్ఞానం" పుస్తకం చదువుతున్నప్పుడు "పరిశుద్ధ (జ్ఞాన) గ్రంథం" బైబిలు కూడా మీ వద్ద ఉంచుకొని, అందులోని భాగాలను పరిశీలించండి.

## I. యౌవనస్థులకు ఉపదేశం 1-10 అధ్యా.

ఈ భాగాన్ని "కుమారులకు ప్రసంగాలు" అని చెప్పవచ్చును. ఇవి "ఆగుము! చూడుము! వినుము! అని దేవుడిచ్చే హెచ్చరికలు. ఈ భాగంలో దేవుని యందలి భయము అన్నది, తండ్రి ప్రేమకు ప్రతిగా అతనికి బాధకలిగించేదేమైనా చేస్తానేమో అని కుమారునిలో ఉండే భయమే గాని, దేవుడు ఏదో చేస్తాడు అన్న భయము కాదు. ఈ భయము ప్రేమలో నుండే పుడుతుంది. దేవునికి దుఃఖం కలిగించకూడదన్న ఈ భయం దైవికమైన జీవితానికి దోహదపడుతుంది. జ్ఞానానికి మూలమైన యేసుక్రీస్తుతో సరైన సంబంధం లేనంతవరకు మనము జ్ఞానముతో జీవించలేము. "జ్ఞానము సంపాదించుకొనుటయే జ్ఞానమునకు ముఖ్యాంశము. నీ సంపాదన అంతయు ఇచ్చి బుద్ధి సంపాదించుకొనుము." (4:15) దేవుడు జ్ఞానం లేనివారికి బుద్ధిని, యౌవనులకు తెలివిని, వివేచనను ఇవ్వాలని కోరుతున్నాడు (1:4). మనం కనీస ఇంగిత జ్ఞానం కలిగి ఉండాలని కోరుతున్నాడు. ఈనాడు ఈలోకంలో అది కొరవడింది.

సామె 4:23-26 లో సర్వశరీరమును గూర్చి వ్రాయబడింది. హృదయాన్ని కాపాడుకోవాలి (23వ) మూర్ఖమైన, కుటిలమైన మాటలను మన నోటి నుండి రానియ్యవద్దు (24వ) కన్నులు సూటిగా చూడాలి. (25వ) నడిచే మార్గాన్ని సరాళం చేసికోవాలి (25వ).

ఇక క్రమశిక్షణ విషయానికొస్తే తల్లిదండ్రులు పిల్లల్ని క్రమశిక్షణ చెయ్యాలని ఖచ్చితంగా చెప్పబడినా, ఆ క్రమశిక్షణ, దేవుడు తన పిల్లలను శిక్షించినట్లుగా ఉండాలి. (3:11,12) అంత్య దినాలలో సంభవించబోయే భ్రష్టత్వంలో తల్లిదండ్రులకు అవిధేయులగుట అన్నది ఒకటి (II తిమో 3:2). సామెతల గ్రంథంలో, యౌవనస్థులు చెడు సహసమును గూర్చి ఆలాగే అపవిత్రత, అసహనం, కోపం, పోట్లాటలను గూర్చి కూడ హెచ్చరించబడుతున్నారు. (1:10-19; 4:14-19; మరియు 3,10,13,15,16,18 అధ్యా).

నాలుకను భద్రం చేసికోవడం గూర్చి కూడ వ్రాయబడింది. మన నాలుకను వశంలోనే ఉన్నాయి గనుక దాన్ని జాగ్రత్తగా వాడుకోవాలి. (12:22; 18:21). ఇవన్నీ కూడ దేవుని జ్ఞానమైన క్రీస్తు మనలో ఉంటేనే సాధ్యమౌతుంది.

## II. మానవులందరికి ఉపదేశం (11-20 అధ్యా).

ఈ భాగంలో తప్పుడు విధానంలో పొదుపు చేయడం (11:24). అబద్ధాలు చెప్పడం (13:5) మాట్లాడే విధానం (15:1) నడతలు (16:2) స్నేహితులు (18:24) త్రాగుడు (20:1) నీతియుక్తమైన జీవితం (20:7) పిల్లల పెంపకం (22:6) మొదలైన వాటిని గూర్చి వ్రాయబడింది.

బైబిల్లో మద్యపానమును గూర్చి హెచ్చరించినంతగా మరే పాపమును గూర్చి హెచ్చరించబడలేదు. (20,23,31 అధ్యా; I కొరి 6:9,10). సామెతల గ్రంథంలోని మాటలన్నీ చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్ల వంటివి (25:11).

ఎలా చెయ్యాలో తెలియనిదే ఏ మనిషి కూడ ఏమి చేయలేడు. అయితే తమకివ్వబడిన సలహాలను, సూచనలను పూర్తిగా అనుసరించరు. పైగా చివరికి మాకు ఎవ్వరూ తగిన మంచి సలహా ఇవ్వలేదని వాపోతారు. ప్రియులారా! సామెతల గ్రంథం దేవుని చిత్తాన్ని దేవుని మార్గాన్ని తెలియజేస్తుంది. దాన్ని అనుసరిద్దాం. మేలు పొందుదాం.

**III. రాజులకు అధికారులకు ఉపదేశం (21–31 అధ్యా).**

ఈ భాగంలో రాజులు మరియు అధికారులకు ఉండాల్సిన లక్షణాలు వివరించబడ్డాయి. స్వయం నిగ్రహము (21:23) పలుకుబడి (22:1) సలహాలు (24:6) స్త్రీలను గూర్చి (25:24) చాడీలు (26:20) వాయిదా వేయుట (27:1) వివేకము (28:16) లంచము (29:4) భద్రత (30:5) మొదలైన వాటిని గూర్చిన ఉపదేశాన్ని హెచ్చరికల్ని ఈ భాగంలో చూస్తాము.

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

### I. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సామెతలు :

**1) మంచి పేరు :** ప్రతివ్యక్తి జీవితం ఇతరులపై, సమాజంపై ప్రభావాన్ని చూపిస్తుంది. మంచి వ్యక్తుల పేరు చరిత్ర పుటలలో చేర్చబతాయి. చిరస్మరణీయమౌతాయి. "గొప్ప ఐశ్వర్యము కంటె మంచి పేరును.......... కోరదగినవి. (సామె.21:1) "నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును." (సామె.10:7).

2) **మంచి ప్రవర్తన :**

ఎ) **ఇంద్రియ నిగ్రహం :** తన్నుతాను నిగ్రహించుకొనే విధానంపై ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. ఈ నిగ్రహము పరిశుద్ధాత్మ ద్వారానే సాధ్యమైనా (2 తిమోతి 1:7). ఆ వ్యక్తి ఆత్మ స్వాధీనంలోనికి వచ్చినప్పుడే, అట్టి శక్తిని పొందగలుగుతాడు. సామెతల గ్రంథం మనస్సును స్వాధీనపరచుకొనుటను గూర్చి (16:32 25:28) మరియు నోటిని అదుపులో ఉంచుకొనుటను గూర్చి (13:3 17:27,28 18:21, 21:23) చూపు (4:25), కోపము (29:11), పాదాలను (1:15, 4:27) అదుపులో ఉంచుకొనుటను గూర్చి మరియు ధనాపేక్షను అదుపులో ఉంచుకొనుటను గూర్చి (23:4; 28:20) హెచ్చరిస్తుంది.

బి) **దీర్ఘశాంతం :** ఆత్మఫలంలో ఒకటైన దీర్ఘశాంతం దైవలక్షణం. దీర్ఘశాంతం అనేక నష్టాలను, ఉపద్రవాలను, ఉగ్రతను తప్పిస్తుంది. అందుకే దీర్ఘశాంతము గలవాడు మహావివేకిగా ఎంచబడుచున్నాడు (14:29). అది సుబుద్ధి వలననే కలుగుతుంది (19:11).

3) **మంచి మాటలు :** పరస్పర అవగాహనకు మాటలే ముఖ్యము. మనం మాట్లాడే విధానాన్ని బట్టి ఇతరులు స్పందిస్తారు. మన మాటలు ఏలాంటి ప్రతిస్పందన నిస్తున్నాయో పరిశీలించుకోవాలి. మాటల చాతుర్యం (Communication Skills) జీవితంలో అన్ని రంగాలలోనూ అవసరం. కనుక ఇలాంటి నైపుణ్యత కొరకు అభ్యాసం చేద్దాం.

- నోటి ఫలము చేత మనుష్యుడు మేలు అనుభవించును – 13:2.
- నీతిమంతుని నాలుక ప్రశస్తమైన వెండి వంటిది 10:20.

- ఇంపైన మాటలు తేనెపట్టు వంటివి. అవి ప్రాణమునకు మధురమైనవి, ఎముకలకు ఆరోగ్యకరమైనవి – 16:24.
- జ్ఞానుల నాలుక ఆరోగ్యదాయకము – 12:18.
- నీతిమంతుని పెదవులు అనేకులకు ఉపదేశించును – 11:21.
- జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములు పలుకును – 15:2.
- సాత్వికమైన నాలుక జీవవృక్షము – 15:4.
- సాత్వికమైన నాలుక ఎముకలను నలుగగొట్టును – 25:15.
- నీతిమంతుని మనస్సు యుక్తముగా ప్రత్యుత్తరమిచ్చుటకు ప్రయత్నించును – 15:20.
- సరిగా ప్రత్యుత్తరమిచ్చిన వానికి దాని వలన సంతోషము పుట్టును. సమయోచితమైన మాట ఎంత మనోహరము – 15:23.
- సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్ల వంటిది – 25:11.
- మృదువైన మాట క్రోధమును చల్లార్చును – 15:1.

4) **మంచి స్నేహితులు :** స్నేహమన్నది ఒక పాఠశాల వంటిది. అది ఒక వ్యక్తిని మంచివానిగానైన మారుస్తుంది లేక చెడ్డవానిగానైనా మారుస్తుంది. కనుక మనం ఎలాంటి వారితో స్నేహం చెయ్యాలో తెలిసికోవడం అవసరం. మంచి స్నేహం గొప్ప లాభదాయకం.

- జ్ఞానుల సహవాసం చేయువాడు జ్ఞానము గలవాడగును – 13:20.
- ఇనుముచేత ఇనుము పదునగును, అట్లు ఒకడు తన చెలికానికి వివేకము పుట్టించును –27:17.
- చెలికాని హృదయములో నుండి వచ్చు మధురమైన మాటలు హృదయమును సంతోషపరచును – 27:9.
- ఆరోగ్యం, ఐశ్వర్యం ఉన్నప్పుడు మనల్ని ఆశ్రయించి, అవి విడచిపోగానే మనల్ని విడచిపోయేవారు నిజమైన స్నేహితులు కారు.
- "నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును – 17:17.
- "సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" – 18:24.
- మంచి స్నేహితుడు మన క్షేమాన్ని కోరతాడు. కనుక మన లోపాలను సరిచేస్తాడు. తప్పు చేసినప్పుడు గద్దిస్తాడు. అవి మనకు బాధ కలిగించినా, అది మన మేలు కొరకేనని గ్రహించాలి.
- "మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును" – 27:6. అందరికన్న మంచి స్నేహితుడైన యేసుక్రీస్తును (యోహాను 15:13–15) రక్షకునిగా అంగీకరించినవారు మంచి స్నేహితుల సహవాసాన్నే కోరుతారు.

5) **మంచి పనితనము :** ఈ లోకములో పుట్టిన ప్రతి వ్యక్తి తన జీవనోపాధి కోసం తప్పనిసరిగా పనిచెయ్యాలి. ఒకని ఆకలి వానిచేతకష్టము చేయిస్తుంది (16:26).

పని అన్నది మనిషి జీవించడానికి దేవుడు చేసిన ఏర్పాటు. పనిచేయనిదే భోజనము

చేయకూడదని దేవుని నియమం (సామె.31:27  2 థెస్స.3:10) కనుక సోమరిగా ఉండడంకన్న జీవనోపాధి కోసం ఏ పనినైనా చేయవచ్చును (14:23). కష్టజీవికి సమృద్ధిగా ఆహారం లభిస్తుంది (12:11). మనం చేసే పనులలో చురుకుదనం ఉండాలి. దానిని ఒక బరువైన బాధ్యతగా భావించక దేవునిచే ఇవ్వబడిన ఒక ఆధిక్యతగా భావించాలి. చురుకుగా ఉండడం గొప్ప భాగ్యం (12:27). అది మనకు, మన కుటుంబాలకు లాభం చేకూరుస్తుంది. (సామె.31:17-25, 31:11). పనిలో జాగుచేస్తే నష్టానికి కారణమౌతుంది (18:9). దేవుడు నీకు ఇచ్చిన పనిని శ్రద్ధగా చేస్తే గొప్పమేలు పొందుతావు.

- శ్రద్ధగలవారి ప్రాణము పుష్టిగానుండును - 13:4.
- శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును - 10:4.
- శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు - 12:24.
  అంతమాత్రమే కాదు పనిలో నమ్మకత్వం కూడ ఉండాలి. అది అన్నిటికన్న ప్రాముఖ్యమైనది.
- "నమ్మకమైనవానికి దీవెనలు మెండుగా కలుగును" - 28:20.అలా క్రమేణ ఆ పనిలో నైపుణ్యతను సాధించి, గొప్పవారి యెదుట ఘనత పొందగలుగుతావు - 22:29.

6) **మంచి సంపాదన :** ఒక వ్యక్తి ఎంత సంపాదిస్తున్నాడనే దానికన్నా ఎలా సంపాదిస్తున్నాడన్నది ముఖ్యం. "న్యాయవిరోధముగా ఆస్తి సంపాదించుకొనువాడు తాను పెట్టని గుడ్లను పొదుగు కౌజు పిట్టవలె నున్నాడు. సగము ప్రాయములో వాడు దానిని విడువ వలసి వచ్చును." (యిర్మీయా 17:11) అని బైబిలు స్పష్టంగా చెప్తుంది. సామెతల గ్రంథం దీనిని నొక్కివక్కాణిస్తుంది.

- మోసముచేత సంపాదించిన ధనము క్షీణించిపోవును. కష్టముచేసి కూర్చుకొనువాడు తన ఆస్తిని వృద్ధిచేసికొనును. 13:11.
- అన్యాయముచేత కలిగిన గొప్పవచ్చుబడికంటే నీతితో కూడిన కొంచెమే శ్రేష్ఠము- 16:8. కష్టపడి సంపాదించినా, దేవుని ఆశీర్వాదం లేకుంటె ఒక వ్యక్తి, ఐశ్వర్యవంతుడు కాలేడు. నిజమైన సంతోషము, సంతృప్తి ఉండదు.
- "యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యమిచ్చును, నరుల కష్టముచేత ఆయాశీర్వాదము ఎక్కువకాదు - 10:22.
- "నెమ్మది లేకుండ విస్తారమైన ధనముండుట కంటె, యెహోవాయందలి భయభక్తులతో కూడ కొంచెము కలిగియుండుట మేలు" - 15:16.

## II. కుటుంబ జీవితానికి సంబంధించిన సామెతలు :

దేవుడు చేసిన మొదటి వ్యవస్థ కుటుంబం. కుటుంబాలు బాగుంటే, సమాజం బాగుంటుంది. దేశం బాగుంటుంది. కుటుంబాలు ఈ లోకంలో, పరలోకానికి ప్రతీకగా ఉండాలని దేవుని ప్రణాళిక. క్రీస్తుకు సంఘానికి మరియు క్రీస్తుకు విశ్వాసికి గల సంబంధానికి ప్రతి రూపంగా కుటుంబమున్నది. కుటుంబములో భార్యభర్తల సంబంధాలు క్రీస్తుకు మరియు సంఘమునకుగల సంబంధమువలె, అలాగే తల్లిదండ్రులకు మరియు పిల్లలకు మధ్యగల సంబంధం విశ్వాసికి క్రీస్తుతో గల సంబంధంవలె ఉండాలి. అందుకు ఉండవలసిన నైతిక

ప్రమాణాలను గూర్చి, దైవిక క్రమశిక్షణను గూర్చి, దైవిక ఉపదేశమును గూర్చి సామెతల గ్రంథం వివరిస్తుంది.

కుటుంబ జీవితంలో వైఫల్యతను గూర్చి తీవ్రమైన హెచ్చరికలు చేయబడ్డాయి. "తన యింటివారిని బాధపెట్టువాడు గాలిని స్వతంత్రించుకొనును" (సామె. 11:29). "తన యిల్లు విడిచి తిరుగువాడు గూడు విడిచి తిరుగు పక్షితో సమానుడు" (సామె. 27:8), దీనిని బట్టి చూస్తే దేవుడు కుటుంబాలకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాడో అర్థమౌతుంది.

1. **సద్భక్తి :** దేవునియందు భయభక్తులు గలిగియుండుట ద్వారానే కుటుంబాలు దీవించ బడతాయని స్పష్టమౌతుంది.
   - భక్తిహీనులు పాడైపోవుదురు. నీతిమంతుల యిల్లు నిలుచును – 12:76.
   - భక్తి హీనుల యిల్లు నిర్మూలమగును, యథార్థవంతుల గుడారము వర్థిల్లును. 14:11.
   - నీతిమంతుల సంతానము విడిపింపబడును – 11:21.
   - యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహుధైర్యము పుట్టించును. అట్టివారి పిల్లలకు ఆశ్రయస్థానము కలదు. 14:26.
   - నీతిమంతుని యిల్లు గొప్ప ధననిధి – 15:6.
   - భార్య దొరికిన వానికి మేలు దొరికెను. అట్టివాడు యెహోవా వలన అనుగ్రహము పొందినవాడు 18:22.
2. **సత్సంబంధాలు :** భార్యాభర్తలకు మరియు తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య సత్సంబంధా లుండాలంటే మొదట నమ్మకత్వం అవసరం. భర్త భార్యపట్ల. భార్య భర్తపట్ల శరీరసబంధాల విషయంలోను, బాధ్యతల విషయంలోను నమ్మకంగా ఉండాలి (6:27–35) (31:11).
3. **సంతుష్టి :** భార్యాభర్తల మధ్య సత్సంబంధాలుంటే ఒకరివలన మరొకరు సంతుష్టి చెందగలుగుతారు (5:15–20).
4. **సమాధానం :** ఎన్ని ఉన్నా, ఎంత సంపాదించినా కుటుంబంలో సమాధానం లేనట్లైతే అంతకన్న దౌర్భాగ్యస్థితి మరొకటిలేదు. "రుచికరమైన భోజనపదార్థములున్నను. కలహముతో కూడి యుండిన ఇంటనుండుట కంటె, నెమ్మది కలిగియుండి "రొట్టెముక్క తినుటమేలు" (17:1 25:24). ఒకరినొకరు ప్రేమించి, క్షమించి ఎవరి తప్పులు వారు సరిచేసుకొంటె సమాధానబంధాన్ని కాపాడుకోవచ్చును. "నీతిమంతుడు ఏడు మారులు పడినను తిరిగిలేచును." (26:16).
5. **సంతోషం :** వస్తువాహనాలు, ఐశ్వర్య ఘనతల వలన కుటుంబంలో నిజమైన సంతోషం లభించదు. కుటుంబంలోని ప్రతివ్యక్తి దైవభక్తి గలిగి సౌశీల్యత, సత్ప్రవర్తన కలిగివున్నప్పుడే కుటుంబం సంతోషంగా ఉంటుంది. "నెమ్మది లేకుండ విస్తారమైన ధనముండుట కంటె, యెహోవాయందలి భయభక్తులతో కూడా కొంచెము కలిగియుండుటమేలు" (15:16).

   భర్తను బట్టి భార్యకు, భార్యనుబట్టి భర్తకు, తల్లిదండ్రులను బట్టి పిల్లలకు, పిల్లలను బట్టి తల్లిదండ్రులకు సంతోషం కలగాలి.

ఎ) ఆమె పెనిమిటి దేశపు పెద్దలతో కూడ కూర్చుండును, గవినియొద్ద పేరుగొనినవాడై యుండును." – 31:23.

బి) "ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు, చాలా మంది కుమార్తెలు పతివ్రతా ధర్మముననుసరించి యున్నారు గాని, వారందరిని నీవు మించినదానవు అని ఆమె పెనిమిటి ఆమెను పొగడును" (31:28,29) (19:14; 12:4 కూడా చదవండి).

సి) నీ తల్లిదండ్రులను నీవు సంతోష పెట్టవలెను. నిన్ను కనిన తల్లిని ఆనందపరచవలెను (23:25) (15:20; 17:21,25; 23:24 కూడా చదవండి).

6. **సమృద్ధి :** కుటుంబంలో సమృద్ధి కుటుంబ యజమాని కష్టార్జితంపై ఆధారపడి ఉంటుంది. "తన భూమిని సేద్యపరచుకొనువానికి ఆహారము సమృద్ధిగ కలుగును" 12:11 (27:23-27; 28:19 కూడా చదవండి).

"జ్ఞానము వలన ఇల్లు కట్టబడును, వివేచన వలన అది స్థిరపరచబడును. తెలివిచేత దాని గదులు విలువగల రమ్యమైన సర్వసంపదలతో నింపబడును" 24:3. (31:11,21,22 చదవండి).

దేవుడు ఇచ్చిన సంపదలను సద్వినియోగం చేసుకోగల దైవజ్ఞానం కుటుంబములో ఎంతైనా అవసరం.

"విలువగల ధనమును నూనెయు జ్ఞానుల యింటనుండును. బుద్ధిగలవాడు దానిని వ్యయపరచును" 21:20.

"సుఖభోగములయందు వాంఛగలవానికి లేమి కలుగును, ద్రాక్షారసమును నూనెయు వాంఛించువానికి ఐశ్వర్యము కలుగదు" 21:17.

7. **సద్బోధ :** దైవభక్తిగల కుటుంబాలలో దైవోపదేశం తప్పనిసరిగా ఉండాలన్నది దేవుని ఆజ్ఞ (ద్వితీ.6:4-9). సామెతల గ్రంథం కూడా దానిని నొక్కి వక్కాణిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు దేవున్ని ఆశ్రయించడానికి మరియు వారికి సత్యప్రమాణమును తెలియజేయడానికి ఉపదేశం చేయాలి (22:6; 22:19-21; 31:1,26). పిల్లలు తల్లిదండ్రుల ఉపదేశాన్ని వినాలి.

"నా కుమారుడా నీ తండ్రి ఉపదేశమును ఆలకింపుము నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము" (1:8; 23:22). తల్లిదండ్రుల బోధ అంగీకరించినవారు బుద్ధిగలవారు (15:5; 28:7), లోబడనివాడు నాశనమౌతాడు (29:1).

8. **శిక్షణ :** కుటుంబములో ఉపదేశముతో పాటు క్రమశిక్షణ కూడా అవసరం. పిల్లలలో సయితం స్వాభావికముగా పాపం ఉంటుంది. "బాలుని హృదయములో మూఢత్వము స్వాభావికముగా పుట్టును. శిక్షాదండము దానిని వానిలో నుండి తోలివేయును" (సామె.22:15 ఆది.కా.8:21 కీర్తన.51:5). పిల్లల వైఖరిని గమనిస్తు వారు మొక్కగా ఉన్నప్పుడే శిక్షించి సరిచేయనట్లైతే కుటుంబానికి మరియు సమాజానికి హానికరమైన వ్యక్తులుగా తయారవుతారు.

"తండ్రి శిక్షించిన కుమారుడు జ్ఞానము గలవాడగును" (13:1). "బెత్తము వాడని వాడు తన కుమారునికి విరోధి. కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును." (13:24). "బుద్ధి వచ్చునని నీ కుమారుని శిక్షింపుము అయితే వాడు చావవలెనని కోరవద్దు." (19:18).

**శిక్షణ వలన కలిగేమేలు :** "గాయములు చేయు దెబ్బలు అంతరంగములో చొచ్చి

చెడుతనమును తొలగించును" (20:30). "నీ బాలురను శిక్షించుట మానకుము. బెత్తముతో వాని కొట్టిన యెడల వాడు చావకుండును. బెత్తముతో వాని కొట్టిన యెడల పాతాళమునకు పోకుండ వాని ఆత్మను నీవు తప్పించెదవు" (23:13,14). "నీ కుమారుని శిక్షించిన యెడల అతడు నిన్ను సంతోషపరచును. నీ మనస్సునకు ఆనందము కలుగజేయును" (29:17).

9. **సదుపాయము :** దేవునియందు సద్భక్తి గలిగి, సక్రమ కష్టార్జితములో దేవునికి ఇచ్చిన వారికి సమృద్ధి ఉంటుంది. "నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును, నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగానుండును, నీ గానుగలలో నుండి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును" (3:9,10). దానిని సరైన విధంగా వినియోగించినవారు, తమ మట్టుకే గాక, వారి తదనంతరం వారి పిల్లల్ని ఆస్తికర్తలుగా చేస్తారు. (13:22).

## III. సామాజిక జీవితమును గూర్చిన సామెతలు :

మనిషి సంఘజీవి, సమాజంలో ఇతర వ్యక్తులు మనకు ఎంత అవసరమో, మనము కూడా వారికి అంతే అవసరం. ఒకరితో మరొకరు సంబంధం లేకుండ ఈ లోకంలో జీవించడం కష్టం. కలిసి జీవించడంలో కూడా ఎన్నో కష్టాలుంటాయి. అయితే అందరితో ప్రేమకలిగి వారికి ఆశీర్వాదకరంగా జీవించాలన్నదే దేవుని ఉద్దేశం. అందుకే మనల్ని ఇంకా ఈ లోకంలో ఉంచాడు.

1. **పరస్పర సంబంధం :** పొరుగువారిని గౌరవించాల్సిన విధానాన్ని గూర్చి సామెతల గ్రంథం హెచ్చరిస్తున్నది. "తన పొరుగువానిని తృణీకరించువాడు బుద్ధిలేనివాడు" (11:12). "తన పొరుగువానిని తిరస్కరించువాడు పాపము చేయువాడు" (14:21). వారు ఎలాంటి వారైనా మన ప్రవర్తన యథార్థంగా వుంటే శత్రువులు సహా మిత్రులుగా మారతారు (16:7) మనలో దేవుని ప్రేమను చూడగలుగుతారు.

2. **పరస్పర సమాధానం :** తరచుగా సమాధానానికి భంగం కలిగించేవి కలహాలు, జగడాలు. అవి చిన్న చిన్నవే అయినా పరస్పర సంబంధాలకు ముప్పుకలిగిస్తాయి. గనుక వాటి విషయం జాగ్రత్తగా ఉండాలి. "నీకు హాని చేయని వానితో నిర్నిమిత్తముగ జగడమాడవద్దు" (3:30). "కలహమునకు దూరముగా నుండుట నరులకు ఘనత. మూర్ఖుడైన ప్రతివాడు పోరునే కోరును" (20:3. "ఆలోచన లేక వ్యాజ్యెమాడుటకు పోకుము" (25:8). "తనకు పట్టని జగడమును బట్టి రేగువాడు దారినపోవుచున్న కుక్క చెవులు పట్టుకొనువానితో సమానుడు" (26:17).

3. **పరస్పర సహాయము :** ఒకరికొరకు మరొకరు ప్రార్థిస్తూ, ఒకరి భారాలు మరొకరు మోయడం సంఘ, లేక సమాజ జీవితానికి దేవుడిచ్చిన నియమం. "ఈలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:2) అని పౌలు సంఘాలకు హెచ్చరించాడు. "మేలు చేయుట నీ చేతనైనప్పుడు దాని పొందదగినవారికి చేయకుండ వెనుకతియ్యకుము" (3:27). మేలు చేయలేకపోతే పర్వాలేదుగాని కీడు తలపెట్టవద్దు సుమా!
"నీ పొరుగువాడు నీ యొద్ద నిర్భయముగా నివసించునప్పుడు వానికి అపకారము కల్పింపవద్దు" (3:29).

"భక్తిహీనుడు తన నోటిమాటచేత తన పొరుగువారికి నాశనము తెప్పించును" (11:9).

"యథార్థవంతులు ఒకరియందు ఒకరు దయ చూపుదురు" (14:9).

"కృప చూపుట నరుని పరులకు ప్రియునిగా చేయును" (19:22).

"నీతిమంతుడు తన పొరుగువానికి దారిచూపును, భక్తిహీనుల ప్రవర్తన వారిని దారి తప్పించును." (12:26).

"జ్ఞానముగలవారు ఇతరులను రక్షించుదురు" (11:30).

మనం ఇతరులకు దారి చూపిస్తున్నామా? వారి రక్షణను గూర్చి భారం ఉందా. మన ప్రవర్తన ఇతరులు రక్షించబడడానికి కారణమౌతున్నదా?

"చావునకై పట్టబడినవారిని నీవు తప్పించుము, నాశనమునందు పడుటకు జోగుచున్న వారిని నీవు రక్షింపవా? (24:11).

4. **పరస్పర సహకారం :** పొందిన దానితో తృప్తిచెంది కలిగిన దానిని ఇతరులతో పంచుకోవడమే. ఔదార్యం. ఇది క్రీస్తును అంగీకరించిన ప్రతి విశ్వాసి కలిగి ఉండాల్సిన లక్షణం. (22:9 14:21 14:31 19:17 11:24,25).

**ఔదార్యమునకు మచ్చుతునక యేసుక్రీస్తే.**

"మీరు మన ప్రభువైన యేసుక్రీసు కృపను ఎరుగుదురు గదా! ఆయన ధనవంతుడైయుండియు, మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ. 8:9). ఔదార్యం, విశ్వాసులకు, సంఘములకు అనుగ్రహింపబడిన దేవుని కృప (2 కొరింథీ. 8:1). ఈ కృపలో మనం అభివృద్ధి చెందాలి (2 కొరింథీ. 8:7).

5. **పరస్పర విధేయత :** సామాజిక జీవితంలో వుండే మరో ప్రాముఖ్యమైన విషయం అధికారులకు మరియు పనివారికి, యజమానులకు మరియు దాసులకు మధ్యగల సంబంధాలు. వాటిని కూడా కాపాడుకోవాలి. అందుకు యజమానులు దాసులు కలిగి ఉండాల్సిన లక్షణాలను చూద్దాం.

ఎ) **సేవకులు :** "బుద్ధిగల సేవకుడు రాజులకిష్టుడు. అవమానకరముగా నడుచువాని మీద రాజు కోపించును.' (14:35).

"నా కుమారుడా యెహోవాను ఘనపరచుము, రాజును ఘనపరచుము. ఆలాగు చేయనివారి జోలికి పోకుము." (24:21).

"నమ్మకమైన దూత తనను పంపువారికి కోతకాలపు మంచు చల్లదనము వంటివాడు. వాడు తన యజమానుల హృదయమును తెప్పరిల్లజేయును." (25:13).

"తన యజమానుని మన్నించువాడు ఘనత నొందును." (27:18).

బి) **అధికారులు :** "జ్ఞానముగల రాజు భక్తిహీనులను చెదరగొట్టును" (20:26).

"అధికారులు న్యాయమును బట్టి పాలన చేయుదురు" (8:15).

"అబద్దమాడుట అధిపతికి బొత్తిగా తగదు" (17:7).

"న్యాయము జరిగించుట వలన రాజు దేశమునకు క్షేమము కలుగజేయును" (29:4).

"అనేకులు ఏలువాని దయ కోరుచుందురు". (29:26).

## IV. ప్రత్యేక హెచ్చరికలు :

**1. నైతిక జీవితమును గూర్చి :**

అ) అక్రమ సంబంధాలు : 2:6-20, 5:3-14, 6:24-35; 7:5-21.
వాని వలన కలిగే నష్టాలు : 6:33; 7:26,27; 22:14; 23:27,28:3; 31:3
తప్పించుకొనే మార్గం : 7:1-5.

ఆ) అక్రమ సంపాదనను గూర్చి : 15:8; 16:19; 20:17; 21:6; 22:16,22; 28:6,8 "దుర్లాభమును ద్వేషించువాడు దీర్ఘాయుష్మంతుడగును" (28:16).

ఇ) అన్యాయ తీర్పును గూర్చి : 24:23,24; 28:5,21
న్యాయముగా తీర్పు తీర్చువారికి మేలు కలుగును" 24:25; 29:7; 31:8,9.

**2. లంచమును గూర్చి :** 15:27; 17:8,23; 28:8, 29:4.

**3. వర్తకమును గూర్చి :** 11:1; 16:11; 20:10,23.

**4. సోమరితనమును గూర్చి :** వ్యక్తిగతముగా కలిగే నష్టం. 6:4-11; 10:4,5; 12:27; 13:4; 19:15; 20:4; 21:25; 24:33,34.
ఇతరులకు కలిగే నష్టం : 10:26; 18:9.

**5. చెడు స్నేహమును గూర్చి :** పాపులతో భక్తిహీనులతో స్నేహం చేయవద్దు (1:10-19;4:14-17).

- బుద్ధిహీనునితో స్నేహం చేయవద్దు. (14:7).
- కోపచిత్తునితో సహవాసం చేయవద్దు. (22:24).
- ఇతరులతో పూటబడువారితో చేరవద్దు. (22:26).

తిండిబోతులు, త్రాగుబోతులతో స్నేహం చేయవద్దు.

**6. కొండెములను గూర్చి :** 10:18; 11:13; 16:28; 20:19; 26:20.

## V. దేని కంటే ఏది శ్రేష్టము? ఏది మేలు :

1. వంచకుడై ధనము సంపాదించిన వాని కంటె యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి. 28:6.
2. నెమ్మది లేకుండా విస్తారమైన ధనముండుట కంటే దేవునియందు భయభక్తులతో కొంచెం కలిగి ఉండుట మేలు 15:16.
3. గొప్ప ఐశ్వర్యం కంటె మంచి పేరు, వెండి బంగారములు కంటె దయ కోరదగినవి (22:1).
4. అన్యాయపు అధిక సంపాదన కంటే నీతి న్యాయాలతో కొంచెం శ్రేష్ఠము (16:8).
5. వెండి బంగారాల సంపాదనకంటే తెలివి జ్ఞానముల సంపాదన శ్రేష్ఠము (16:16).
6. పగవాని ఇంట మాంసాహారం కంటే ప్రేమగల ఇంట శాఖాహారం మేలు (15:17).
7. కలహంతో కూడిన రుచికరమైన భోజనం తినుటకంటే నెమ్మది కలిగి వట్టి రొట్టె ముక్క తినుట మేలు. (17:1).

8. గర్విష్ఠులతో దోపుడు సొమ్ము పంచుకొనుట కంటే దీన మనస్సుకలిగి దీనులతో పొత్తు కలిగి ఉండుట మేలు (16:19).
9. పరాక్రమ శాలికంటె దీర్ఘశాంతము కలిగి ఉండువాడు, పట్టణము పట్టుకొనుటకంటె తన మనస్సును స్వాధీనపరచుకొనువాడు శ్రేష్ఠుడు (16:32).
10. పెదవులతో మూర్ఖముగా మాటలాడువాని కంటె నిందారహితముగా నడచుకొను ఒక పేదవాడు శ్రేష్ఠుడు (19:1).
11. గయ్యాళితో పెద్ద ఇంట్లో కాపురం ఉండే కంటే మిద్దె మీద ఒక మూల నివసించుట మేలు 21:9; 25:24.
12. లోలోపల ప్రేమించుటకంటే బహిరంగముగా గద్దించుట మేలు 27:5.

## VI. ప్రాముఖ్యమైన అధ్యాయాలు :

### A. 25–27 అధ్యాయాలు : అలంకార రూపకములు :

ఈ రెండు అధ్యాయాలలోను కొన్ని విషయాలను మరొకదానితో పోల్చి చెప్పడం గమనార్హం. అలంకారరూపముగా చెప్పబడిన ఈ సామెతలను. అర్థం చేసుకొంటే దాని వలన కలిగే లాభనష్టాలను అంచనా వేసుకోవచ్చును. (25:11,12,13,14,18,19,20, 25,28; 26:2,6,7,8,9,11,17,18,19,33; 27:8,9,15,17,19,21).

### B. 30వ అధ్యాయం : ప్రసిద్ధమైన అంశాలు :

1. యెహోవాకు అసహ్యములైనవి ఆరుగలవు. ఏడును ఆయనకు హేయములు.(6:16–19).
2. తృప్తిపడనివి మూడుకలవు– చాలును అని పలుకనివి నాలుగు కలవు. (30:15,16).
3. బుద్ధికి మించినవి మూడు గలవు – గ్రహింపలేనివి నాలుగు కలవు. (30:18,19).
4. భూమిని వణికించునవి మూడు కలవు–అది మోయలేనివి నాలుగుకలవు. (30:21–23)
5. "చిన్నవైనా మిక్కిలి జ్ఞానముగల 4 జీవులు." (30:24–28).
6. "డంబముగా నడుచునవి మూడు కలవు–ఠీవితో నడుచునవి నాలుగు కలవు." (30:29–31).
7. రెండు మనవులు : (30:7–9).
8. నాలుగు దుష్టతరములు.

ఎ) "తమ తండ్రిని శపించుచు తల్లిని దీవించని తరము" (30:11).
బి) "తమ దృష్టికి తాము శుద్ధులై, తమ మాలిన్యమునుండి కడుగబడని వారి తరము." (30:12).
సి) "కన్నులు నెత్తికి వచ్చినవారి తరము." (30:13).
డి) "దరిద్రులను మ్రింగేవారి తరము." (30:14).

### C. 31వ అధ్యాయం : రాజులు మరియు గుణవతియైన భార్య లక్షణాలు :

1. **రాజుల లక్షణాలు (1–9)** : "నీ బలమును స్త్రీలకియ్యకుము, రాజులను నశింపజేయు స్త్రీలతో సహవాసము చేయకుము" (31:3).
"ద్రాక్షారసము త్రాగుట రాజులకు తగదు." (31:4).

"నీ నోరు తెరచి న్యాయముగా తీర్పు తీర్చుము. దీనులకును శ్రమపడువారికిని దరిద్రులకును న్యాయము జరిగింపుము." (31:9).

2. **గుణవతియైన భార్య లక్షణాలు (10–31) :**

"ఆమె పెనిమిటి ఆమెయందు నమ్మికయుంచును." (31:11).

"ఆమె తానుబ్రదుకుదినములన్నియు అతనికి మేలు చేయునుగాని కీడేమియు చేయదు." (31:12).

"తన చేతులారా పనిచేయును." (31:13–15,17).

"ద్రవ్యమును కూడ బెట్టును" (31:16) "సమస్తము సమకూర్చును" (31:21,22,25).

"దీనులకు తన చెయ్యి చాపును" (31:20).

"వ్యాపార లాభము అనుభవముచే తెలిసికొనును" (31:17 24,25).

"ఆమె పెనిమిటి పేరుగొనిన వాడైయుండును." (31:23).

"జ్ఞానము కలిగి తన నోరు తెరచును కృపగల ఉపదేశము ఆమె బోధించును" (31:26).

"తన యింటివారి నడతలను బాగుగా కనిపెట్టును" (31:27).

"పతివ్రతాధర్మము గలది" (31:29).

"పిల్లల చేత భర్తచేత ఇతరుల చేత పొగడబడుతుంది." (31:28,29,31).

"యెహోవాయందు భయభక్తులుగల స్త్రీ" (31:30).

## VII. విరుద్ధమైన విషయాలు :

### 1. నీతిమంతుడు – భక్తిహీనుడు :

| **నీతిమంతుల** | **భక్తిహీనుల** |
|---|---|
| మార్గము అంతకంతకు తేజరిల్లును | – (మార్గము) గాఢాంధకారమయం (4:18,19) |
| ఆశ సంతోషం పుట్టించును | – (ఆశ) భంగమైపోవును (10:28) |
| పేరు జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరం | – (పేరు) అసహ్యత పుట్టించును (10:7) |
| నోరు జీవపు ఊట | – (నోరు) బలత్కారం మరుగు పరచును(10:11,31,32) |
| కోరిక ఉత్తమమైనది | – (కోరిక) అహంకార యుక్తమైనది (11:23) |
| తలంపులు న్యాయయుక్తములు | – (తలంపులు) మోసకరములు (12:5) |
| ఇల్లు నిలుచును | – (ఇల్లు) నిర్మూలమగును (12:7 14:11) |
| దీపం తేజరిల్లును | – (దీపం) ఆరిపోవును (13:9) |
| ఆకలితీర భోజనం చేయును | – కడుపునకు లేమికల్గును (13:25) |
| పాలన–ప్రజలకు సంతోషం | – (పాలన) ప్రజలకు నిట్టూర్పు (29:2) |

2. **జ్ఞానవంతులు – మూఢులు :**

- జ్ఞానముగలవాడు – అపహాసకుడు (9:7–9)
- జ్ఞానముగల కుమారుడు – బుద్ధిలేని కుమారుడు (10:1 15:20)
- జ్ఞానుల సహవాసం – మూర్ఖుల సహవాసం (13:20)
- జ్ఞానవంతురాలు – మూఢురాలు (14:1).
- జ్ఞానుల నాలుక – బుద్ధిహీనుని నోరు (15:2).

- జ్ఞానముగలవాని కోపము – బుద్ధిహీనుని కోపము (29:11).
- తెలివిగలవాని హృదయం – బుద్ధిహీనుని హృదయం (14:33).

3. **ఇతరులు :**

- శ్రద్ధగలవాడు – బద్ధకస్తుడు (10:4).
- దైవభక్తిగలవాని – భక్తిహీనుని ఆయుష్షు (10:27).
- నిజమాడు పెదవులు – అబద్ధమాడు నాలుక (12:9).
- కీడు కల్పించువారు – సమాధానపరచువారు (12:20).
- వివేకి విద్య – అవివేకి విద్య (12:33).
- మంచివాని ఆస్తి – పాపాత్ముల ఆస్తి (13:22).
- నమ్మకమైన సాక్షి – కూట సాక్షి (14:5).
- దీర్ఘశాంతం గలవాడు – ముంగోపి (14:29 15:18).
- సాత్వికము – మత్సరము (14:30).
- మృదువైనమాట – నొప్పించుమాట (15:20).
- బాధపడువాడు – సంతోష హృదయుడు (15:15).
- దరిద్రుడు – ధనవంతుడు (18:23).
- శ్రద్ధగలవాడు – తాలిమిలేనివాడు (21:5).
- యెహోవాయందు నమ్మకముంచువాడు – తన మనస్సును నమ్ముకొనువాడు (28:25,26).
- గర్విష్ఠి – వినయ మనస్కుడు (29:23).

**సామెతల గ్రంథము నుండి క్రొత్త నిబంధనలో పేర్కొన్న మాటలు :**

**సామెతలు 3:11/హెబ్రీ 12:5,6 –** "నా కుమారుడా యెహోవా శిక్షను తృణీకరింపవద్దు ఆయన గద్దింపునకు విసుకవద్దు. తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించురీతిగా యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును."

**సామెతలు 10:12/1 పేతురు 4:8 –** "ప్రేమ దోషములన్నిటిని కప్పును".

తాను ప్రేమించువారిని గద్దించును."

**సామెతలు 10:12/1 పేతురు 4:8 –** "ప్రేమ దోషములన్నిటిని కప్పును".

**సామెతలు 20:22/రోమా 12:17 –** "కీడుకు ప్రతికీడు చేసెదననుకొనవద్దు."

**సామెతలు 25:21,22/రోమా 12:20 –** "నీ పగవాడు ఆకలిగొనినయెడల వానికి భోజనము పెట్టుము. దప్పిగొనిన యెడల వానికి దాహమిమ్ము అట్లు చేయుట చేత వాని తలమీద నిప్పులుకుప్పగా పోయుదువు".

**జ్ఞానాధారుడైన దేవుడు అట్టి శ్రేష్ఠమైన మంచి జీవితాన్ని జీవించుటకు**
**తగిన జ్ఞానమును, తెలివిని, వివేకమును, గ్రహింపును**
**ప్రియ చదువరులందరికీ దయ చేయును గాక! – ఆమేన్!**

